క్లుప్తంగా

నేడు లైన్‌మెన్ దివస్

చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు లైన్‌మెన్ దివస్, జాతీయ భద్రత వారోత్సవాలు శనివారం నుంచి నిర్వహిస్తామని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టు రోడ్డులోని అవతార్ మెహర్‌బాబా ఆడిటోరియంలో శనివారం ఉదయం 8 గంటలకు వారోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ముఖ్య అతిథిగా బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) హాజరవుతారని చెప్పారు.

ఎదురుమొండి లైన్‌మెన్ సస్పెన్షన్

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక మండలంలోని ఎదురుమొండి లైన్‌మెన్ పి. మహాశివుడిని సస్పెండ్ చేశారని విద్యుత్ శాఖ ఉయ్యూరు డీఈఈ రామ్‌భొట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎదురుమొండి గ్రామంలో విద్యుత్ చౌర్యాన్ని ప్రోత్సహిస్తూ డిపార్ట్‌మెంట్‌కు నష్టాన్ని కలిగించడంతో పాటు చెడ్డ పేరు తీసుకొస్తున్నందున సస్పెండ్ చేశామన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడకుండా సక్రమంగా విద్యుత్ బిల్లులు చెల్లించాలని వినియోగదారులకు డీఈఈ సూచించారు.

ముళ్లకంప తొలగింపు

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో ప్రధాన రహదారి ఇరువైపులా ముళ్లకంప తొలగించారు. ఉపాధి పనుల్లో భాగంగా శుక్రవారం 26 మంది కూలీలతో ఫీల్డ్ అసిస్టెంట్ జోకుపర్తి రాజశేఖర్ ముళ్లకంప తొలగించారు. రెండు రోజుల పాటు ముళ్లకంప తొలగించి రహదారి సమస్యను పరిష్కరించామని ఆయన చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ



పెడన: రైతులు తాము పండించే పంటలో విత్తే విత్తనాల సమయంలో విత్తన గుళిక పద్ధతి శ్రీరామరక్షగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ శాఖ మచిలీపట్నం సబ్ డివిజనల్ యాంకర్ స్వామిబాబు అన్నారు. శుక్రవారం ఆయన నందమూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అంగన్‌వాడీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీవో సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ అంత్యోదయ గ్రామ సభ

గూడూరు: మిషన్ అంత్యోదయ గ్రామసభ శుక్రవారం గూడూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. సర్పంచి లింగం సులోచనారాణి అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు ఎంపీపీ సంగా మధుసూదనరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామంలో సేవలు అందిస్తున్న ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ ఆస్తుల వివరాలను గ్రామ సభలో చర్చించారు. పంచాయతీ కార్యదర్శి టీవీవీ భాస్కరరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి



బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలు ఇష్టారాజ్యంగా పెంచి సామాన్యుడిపై మోయలేని భారం మోపుతోందన్నారు. రూ.415 ఉన్న గ్యాస్ ధర బీజేపీ పాలనలో రూ.1200లకు పెరిగిందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం సామాన్యులను కొట్టి బడా బాబులకు దోచిపెడుతోందన్నారు. పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం, రైతు సంఘ నాయకులు ఎం. శ్రీనివాసరావు, జి. నాగేశ్వరరావు, ఎల్.అజయ్‌ఘోష్, పి. వెంకటేశ్వరరావు, ఎం. పద్మ తదితరులు పాల్గొన్నారు.

పూరింటి నుంచి పక్కా గృహాలకు!

- ఏఈ చొరవతో ఎస్టీలకు గూడు
- రెండు నెలల్లో శ్లాబ్ స్థాయికి చేరిన ఇళ్లు
- మెరక తోలేందుకు టీడీపీ నేతల మోకాలడ్డు

మోపిదేవి: వారంతా నిరక్షరాస్యులు. కాలువగట్లపై తాత్కాలికంగా ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్న ఎస్టీలు (యానాదులు). 9 మందికి జగనన్న ప్రభుత్వం నివేశన స్థలాలు ఇచ్చింది. కానీ స్థలానికి మెరక తోలుకోలేని పరిస్థితి. కొంతమంది ఈ స్థలాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. దీంతో ఈ స్థలాలపై లబ్ధిదారులు ఆశలు వదులుకున్నారు. ఇటీవలే నూతనంగా వచ్చిన హౌసింగ్ ఏఈ తాండవకృష్ణ చొరవతో ఎస్టీల ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యాయి. శ్లాబ్ దశకు చేరుకోవడంతో కొద్దిరోజుల్లోనే పక్కా గృహాల్లోకి అడుగు పెడతామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కాలువ కట్ట వద్ద నిర్మించుకున్న ఇళ్లు



మోపిదేవిలో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలు

ఎస్టీలకు నెరవేరనున్న సొంతింటి కల..

మోపిదేవి మండలంలో 23 జగనన్న కాలనీ లేఅవుట్లలో 954 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాల పట్టాలు ఇచ్చారు. కొన్ని చోట్ల పనులు ప్రారంభించారు. మోపిదేవిలోని 3వ లేఅవుట్‌లో 9 మంది ఎస్టీలకు నివేశన స్థలాలు ఇచ్చారు. ఈ స్థలం పల్లంగా ఉండటంతో మెరక పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాయకష్టం చేసుకుని జీవనం సాగించే ఎస్టీలకు మెరక చేసుకునే ఆర్థిక స్తోమత లేదు.

మెరక పనులకు అడ్డుపడుతున్న దుష్టశక్తులు

గతంలో ఎస్టీలకు ఇచ్చిన స్థలాల లేఅవుట్‌లో మెరక కోసం రావివారిపాలెం నుంచి మట్టిని తోలేందుకు ప్రయత్నించగా, కొన్ని దుష్టశక్తులు అడ్డుపడటంతో పనులు నిలిచిపోయారు. రెండు నెలల కిందట నాగాయతిప్ప నుంచి మట్టిని తోలేందుకు ప్రయత్నించగా మళ్లీ కొంతమంది టీడీపీ నేతలు అడ్డుకున్నారు.

ఏఈ చొరవతో శ్లాబ్ లెవల్‌కు ఎస్టీ గృహాలు

మోపిదేవి ఏఈగా రాజులపాటి తాండవకృష్ణ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. వెంటనే ఆయన ఎస్టీల గృహ నిర్మాణ సమస్యపై దృష్టి సారించారు. రూపాయి ఖర్చుపెట్టలేని వీరి పరిస్థితిని గమనించిన ఏఈ 9 మంది ఎస్టీలకు తానే గృహ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. అన్ని అవరోధాలు అధిగమించి రెండు నెలల కిందట గృహ నిర్మాణాలు ప్రారంభించారు. మొత్తం 9 గృహాలు శ్లాబ్ దశకు రాగా వీటిలో 4 గృహాలకు సెంట్రింగ్ పెట్టారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తిచేసి ఎస్టీలకు పక్కా గృహాలు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ తాండవకృష్ణ చెప్పారు. మెరక చేసేందుకు మట్టి సమస్య ఉందని, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎస్టీల గృహాలకు మెరక పనులు చేపట్టేందుకు తమ వంతు కృషి చేస్తామని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. కుల, మత, రాజకీయాలతో సంబంధం లేకుండా గూడులేని ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించి తీరుతామని సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంకల్పానికి తోడు ఏఈ తాండవకృష్ణ, తహసీల్దార్ నవీన్‌కుమార్ తీసుకుంటున్న చర్యల వల్ల 9 మంది ఎస్టీలకు సొంత ఇంటి కల నెరవేరనుంది.



నమ్మలేక పోతున్నాం

కాలువగట్లపై కర్రలు పాతుకుని చిన్న పాకల్లో జీవించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంతంగా స్థలం ఇచ్చారు. మెరక తోలుకునేందుకు, ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు లేకపోవడంతో ఇంటిపై ఆశలు వదులుకున్నాం. ఏఈ చొరవతో పూరి గుడిసె నుంచి పక్కా గృహంలోకి వెళుతున్నామంటే ఇప్పటికీ నమ్మలేక పోతున్నాం.

– తోట రాజమ్మ, మోపిదేవి



ఆ దేవుడే పంపించారు

కాలువ పక్కన నివశించే మమ్మల్ని మనుషులుగా గుర్తించిన దయగల దేవుడు జగనన్న మాకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. స్థలాలు ఇచ్చినా ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. కనీసం మనుషుల్లా చూడని మాకు సొంతిల్లు ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఈని ఆ దేవుడే పంపించారు.

– చెట్టు చిట్టెమ్మ, మోపిదేవి



కలగా ఉంది

సొంత ఇల్లు లేక చెరువు, కాలువగట్లపై జీవించాం. పురుగు, పాములతో సహజీవనం చేశాం. పలుమార్లు పాము కాట్లకు గురయ్యాం. మా తాతల నుంచి గట్లపై పాకల్లోనే జీవించాం. మాకు, మా పిల్లలకు పక్కా ఇళ్లు ఏర్పడటం కలగా ఉంది.

– కోనేటి లక్ష్మీ, మోపిదేవి



పెట్టుబడికి ఇబ్బందిగా ఉంది

హౌసింగ్ ఏఈగా ఇక్కడికి కొత్తగా వచ్చాను. పెట్టుబడికి డబ్బులు లేకపోయినా ఎస్టీల పరిస్థితి చూసి మనసు చలించి పోయింది. పెట్టుబడికి డబ్బులు లేకపోయినా ధైర్యం చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టాను. ప్రభుత్వం ఇచ్చే బిల్లుతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి సాయం అందిస్తే ఇళ్ల నిర్మాణాలు ఇంకా త్వరగా పూర్తవుతాయి.

– రాజులపాటి తాండవకృష్ణ, హౌసింగ్ ఏఈ, మోపిదేవి

హైదరాబాద్, విజయవాడ వెళ్లి పింఛన్ల అందజేత



విజయవాడ వెళ్లి పింఛను అందజేస్తున్న నాగలక్ష్మీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని 33, 20 డివిజన్లలోని ఇరువురు వలంటీర్లు హైదరాబాద్, విజయవాడ వెళ్లి సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు పింఛను సొమ్మును అందజేశారు. 33వ డివిజన్ సచివాలయ వలంటీర్ గౌస్‌పీర్ హైదరాబాద్‌లో వైద్య చికిత్స పొంది బంధువుల ఇంట్లో ఉంటున్న మెహరున్నీసాబేగంకు పింఛను సొమ్మును అందజేశారు. పేద కుటుంబానికి చెందిన ఆమె ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ సహకారంతో వలంటీర్ హైదరాబాద్‌కు వెళ్లి పింఛను సొమ్ము అందించాడు. నగరంలోని 20వ డివిజన్ గిలకలదిండికి చెందిన లంకే పార్వతి అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు పింఛను సొమ్మును వలంటీర్ రామాని నాగలక్ష్మీ విజయవాడ ఆస్పత్రికి వెళ్లి అందజేసింది. డివిజన్ కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాద్ సహకారంతో నాగలక్ష్మీ విజయవాడ వెళ్లి పింఛను సొమ్మును పార్వతికి అందజేసింది.

97 శాతం పంపిణీ

బంటుమిల్లి: మండల పరిధిలో 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ జె. స్వర్ణభారతి తెలిపారు. మొత్తం పింఛన్లు 6,755 ఉండగా 6,517 మందికి పింఛన్ సొమ్ము అందజేశామని చెప్పారు.

ఇంటికే వచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నారు

ఎమ్మెల్యే సింహాద్రి వద్ద గ్రామస్తుల ఆనందం

మేళ్లమర్రు(మోపిదేవి): ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటికి వచ్చి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారని, ఈ విధానం ఎంతో బాగుందని మేళ్లమర్రు శివారు దళితవాడ వాసులు ఆనందం వ్యక్తంచేశారు. పెదకళ్లేపల్లి శివారు మేళ్లమర్రు దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు మాట్లాడుతూ గతంలో సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వారమని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులే మా గృహాలకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు ఇంత మంచి పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి సీఎంను చేస్తామని ఆశీర్వదించారు. గ్రామంలో ఇళ్ల మీదుగా వెళుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను తొలగించాలని ఎమ్మెల్యేను కోరారు. వెంటనే విద్యుత్ శాఖ ఏఈతో మాట్లాడి విద్యుత్ లైన్లను పక్కకు వేయాలని సూచించారు. తొలుత గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పండలనేని అన్నపూర్ణ, గ్రామ పార్టీ కన్వీనర్ గండు దుర్గారావు, సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యురాలు తండు బసవపూర్ణ, కళ్లేపల్లి గణేష్, తండు వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



వృద్ధునికి పింఛను వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పేదల కోసమే ప్రభుత్వ పథకాలు

కోనేరుసెంటర్: ప్రభుత్వ పథకాలు పేదల కోసమేనని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కిట్టు అన్నారు. బందరు మండలం గరాలదిబ్బ గ్రామంలో శుక్రవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పేర్ని కిట్టు గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. కిట్టు మాట్లాడుతూ అర్హత ఉండి పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లంకే వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో సహకార భవనాల నిర్మాణం

- సీఎం జగన్ సహకారంతో వంద కోట్లతో ప్రభుత్వ భవనాలు
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- మాజేరులో పీఏసీఎస్ భవనం ప్రారంభం

కొత్తమాజేరు (చల్లపల్లి): అవనిగడ్డ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన నిధులతో రూ. వంద కోట్లతో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ఈ నియోజకవర్గానికి మంజూరు చేసిన రూ.10 కోట్లతో సహకార భవనాలు నిర్మిస్తున్నామన్నారు. చల్లపల్లి మండలం కొత్తమాజేరులో శుక్రవారం రూ.32.50 లక్షలతో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్, పెడన నియోజకవర్గ పరిశీలకుడు తన్నీరు నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో అవనిగడ్డ నియోజకవర్గంలో అన్ని కేడీసీసీ బ్యాంక్ శాఖలకు సొంత భవనాల నిర్మాణంతో పాటు, నష్టాల్లో ఉన్న పీఏసీఎస్‌లకు నూతన జవసత్వాలు కల్పించామని చెప్పారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు ప్రయోజనాలు, డ్వాక్రా సంఘాలకు రుణాలు, లాకర్ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కేడీసీసీబీ చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సహకార వ్యవస్థ బలోపేతానికి తాము చేస్తున్న కృషిని వివరించారు. 1902లో ఆవిర్భవించిన మాజేరు పీఏసీఎస్ 2019కి ముందు రూ.9 కోట్ల టర్నోవర్‌తో ఉంటే, ఇప్పుడు ఏకంగా రూ.19 కోట్ల టర్నోవర్‌కు చేరిందన్నారు. వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కేవీ వెంకటేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పెద వీరయ్య, కొత్తమాజేరు పీఏసీఎస్ చైర్మన్ అరజా శివశంకర్, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి ఇంకొల్లు శేషగిరి, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెరెక్టర్ మేరుగ జాస్సీలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కేడీసీసీ బ్యాంక్ బీఎం యలవర్తి నగరాజకుమారి, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.



సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలు

డీఎంహెచ్‌ఓ గీతాబాయి

గూడూరు: పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా కృష్ణాజిల్లా పరిధిలోని ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలు సమకూర్చుతున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.గీతాబాయి అన్నారు. గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ.40 లక్షల పీఎఫ్‌సీ సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన వివిధ నిర్మాణ పనులు, సమకూర్చిన వైద్య పరికరాలను శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. బందరు పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి కృషితో పీఎఫ్‌సీ సీఎస్ఆర్ నిధులు రూ.5.07 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన డీఎంహెచ్‌ఓ నోడల్ అధికారిగా ఉండే కమిటీ ఆధ్వర్యంలో నిధుల వినియోగం జరుగుతుందన్నారు. జిల్లాలోని గుడివాడ ఏరియా ఆస్పత్రి, గూడూరు, అవనిగడ్డ, చల్లపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తున్నామని వివరించారు. తద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో నిరుపేదలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



గూడూరు సీహెచ్‌సీని పరిశీలించి మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ గీతాబాయి

అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు

కడవకొల్లు నరసింహారావు

అవనిగడ్డ: పేదల ఇళ్లు, పాఠశాలలు, శ్మశాన వాటికలకు చేపడుతున్న మెరక పనులను టీడీపీ నాయకులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగాయతిప్ప స్కూల్ ఆట స్థలం మెరక చేసేందుకు ఇసుక తోలుతుంటే టీడీపీ నేతలు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. గతంలో మాజీ ఉప సభాపతి బుద్ధప్రసాద్ ఇంటికి అక్రమంగా ఎడ్లంక రేవు పక్క నుంచి వందలాది ట్రక్కుల ఇసుక తోలుకున్నపుడు పర్యావరణం గుర్తుకు రాలేదా అని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనులను అడ్డుకునే సంస్కృతి మాది కాదని, గతంలో ఎంపీ బాలశౌరిని అడిగి మందపాకల కాలువకు రూ.1.50 కోట్ల నిధులు తీసుకొస్తే ఆనాడు ఎమ్మెల్యేగా అడ్డుకున్నది ఎవరో అందరికీ తెలుసని చెప్పారు. మేము కాంట్రాక్టుల ద్వారా కోట్లు సంపాదించేందుకు రాజకీయాల్లోకి రాలేదని, ప్రజా ఉద్యమాలు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు రాజకీయాల్లోకి వచ్చామన్నారు. ఎమ్మెల్యే అనుచరుడి కోసం ఉన్నతాధికారులు దుర్మార్గం చేయడం వల్ల మందపాకల పైపులైన్ పనుల టెండర్లు రద్దు చేశారని బుద్ధప్రసాద్, ఆయన అనుచరులు చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు. ఆ కాంట్రాక్టర్ రెండు లక్షలకు హెచ్‌డీఎఫ్‌సీలో సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకుని దానిని రూ.20 లక్షలకు చేసిన విషయం బయట పడటం వల్లనే ఆయన కాంట్రాక్టు రద్దు చేశారని, ఇందులో ఎలాంటి రాజకీయాలు చేయలేదనన్నారు.

గ్లోబల్ సదస్సుకు 13 లక్షల కోట్ల మేర అంగీకారాలు జరగడం శుభ పరిణామం అన్నారు. బోడగుంటలో ఇళ్లు కాలిపోయిన వారికి రూ.20 వేలు ఇచ్చామని అబద్ధాలు చెప్పడం మీకే చెల్లిందన్నారు. అగ్నిప్రమాద బాధితులను వెళ్లి అడుగుదాం పదండి మీ బండారం ఏమిటో బయట పడుతుందన్నారు. మీ హయాంలోనే ఏర్పడిన లంకమ్మ మాన్యానికి గతంలో ఇసుక తోలుతుంటే అడ్డుకున్నది మీరు కాదా అని బుద్ధప్రసాద్‌ని ప్రశ్నించారు. పేదలు ఇళ్లకు, పాఠశాలలు, శ్మశాన వాటిక మెరక పనులు అడ్డుకోవద్దని టీడీపీ నేతలకు హితవు పలికారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు నజీర్‌బాషా, పట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాస్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కడవకొల్లు

సృజనాత్మకత వెలికి తీసేందుకు దోహదం

అడ్డాడ(పామర్రు): విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈఎండీపీ కార్యక్రమం ఎంతగానో ఉపయుక్తం అవుతుందని హైస్కూల్ హెచ్‌ఎం డి. పద్మజ అన్నారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఈఎండీపీ)లో భాగంగా 9వ తరగతి విద్యార్థులతో పాఠశాల స్థాయిలో ఈఎండీపీ ఎక్స్‌పో–2023 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ నూతన వస్తువుల ఆవిష్కరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయుక్తం అవుతాయని అన్నారు. విద్యార్థులు వారి వారి ప్రతిభను వివిధ అంశాలలో ప్రదర్శించారన్నారు. విద్యార్థులచే రూపొందించిన వివిధ రకాల వస్తువులు ఆహూతులను ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఈఎండీపీ జిల్లా మేనేజర్ భాను కిరణ్, ఈఎండీపీ పాఠశాల రెస్పాన్స్ పర్సన్ బి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థినులు

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం



స్వామివారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక మండల పరిధిలోని డేగలవారిపాలెంలో శ్రీహనుమత్ సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్ర స్వామి నూతన దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. వాస్తు జ్యోతిష్య పండితుడు దాశరధి శ్రీనివాస దీక్షితులుచే శుక్రవారం ప్రత్యేక పూజలు అనంతరం స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు తదితరులు పాల్గొని పూజలు చేశారు.

అనారోగ్యంతో బాధపడుతూ వృద్ధుడి ఆత్మహత్య

కోనేరుసెంటర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బందరు మండలం పోతేపల్లి గ్రామానికి చెందిన శొంఠి నాగేశ్వరరావు (65) కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. మూడేళ్ల కిందట పోతేపల్లి వదిలి మచిలీపట్నంలోని ఈడేపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో కొన్ని నెలల కిందట విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మచిలీపట్నంలోని ఓ ఫిజియోథెరపీ సెంటర్లో చికిత్స పొందుతున్నాడు. గత నెల 27వ తేదీన ఫిజియోథెరపీ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నాగేశ్వరరావు తిరిగి ఇంటికి చేరలేదు. మరుసటి రోజు కుటుంబ సభ్యులు బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఈ నెల రెండో తేదీన చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు నాగేశ్వరరావు పోతేపల్లిలోని తన సొంత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందింది. ఈ విషయాన్ని బందరు రూరల్ పోలీసులకు తెలియజేశారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

భక్తిశ్రద్ధలతో శిలువమార్గం

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం నూతులపాడు ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ మార్గ యాత్ర నిర్వహించారు. ఆర్సీఎం విచారణ గురువు జి. మైఖేల్, సహాయ గురువు రవికాంత్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 40 రోజులపాటు జరిగే దీక్షా దినాలలో పలు ప్రాంతాల్లో ఈ శిలువ మార్గం నిర్వహిస్తామని వారు తెలిపారు.

సుబ్బారాయుడికి విరాళం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి దాతలు శుక్రవారం విరాళమందించారు. మండలంలోని చేవూరుపాలెంకు చెందిన మేలిమి రఘునాథబాబు, కనక నాగమణి దంపతులు ఆలయ ముఖద్వారానికి వెండి తాపడం నిమిత్తం రూ.10,116 విరాళాన్ని ఆలయ కార్యాలయంలో చైర్మన్ శొంఠి నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

6న నాగనాంచారమ్మ సంబరం

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరులో 6న నాగనాంచారమ్మ సంబరం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. సంబరంలో భాగంగా 5న గ్రామంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 6న ఉదయం 9 నుంచి 4గంటల వరకు సంబరం జరుగుతుందని తెలిపారు.

కార్నియాల సేకరణ



గద్దే విజయలక్ష్మి (ఫైల్)

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక నాలుగో వార్డుకు చెందిన గద్దె ఉదయలక్ష్మి (74) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆమె కుమార్తె ఉప్పల శివ సహకారం, మత్తి శివ ప్రోత్సాహంతో సుదర్శి మానవతా సేవా సంస్థ ద్వారా విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ కార్నియాలను సేకరించారు.



